క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులతో స్పెషలాఫీసర్, పీఈటీ

అట్లూరు: అట్లూరు కేజీబీవీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల స్పెషలాఫీసర్ పణిశ్రీ,, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీళ పేర్కొన్నారు. ఈ నెల 26న జిల్లా స్థాయి ఎస్.జి.ఎఫ్ అండర్-19 క్రికెట్ మరియు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడా పోటీలు అన్నమయ్య జిల్లా పుల్లంపేట ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. అందులో అట్లూరు కేజీబీవీ నుంచి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీలో రెడ్డెమ్మ, చంద్రకళ, జగదీశ్వరి, స్పందన, సుప్రియ. సాఫ్ట్‌బాల్ ఆటలో సుహాసిని, లక్ష్మిప్రసన్న, మహాలక్ష్మి, బేస్‌బాల్ ఆటలో కల్యాణి, జాహ్నవి ఎంపికయ్యారని తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

చాపాడు : మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో ఈ నెల 25న పంట కాలువ విషయమై బీర్రు గంగయ్య, బీర్రు గంగాధర్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో బీర్రు గంగయ్యపై బీర్రు గంగాధర్, రాముడు, శ్రీరాములు, సిద్దయ్య దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన గంగయ్య ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య శుక్రవారం తెలిపారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు జనార్దన్‌రెడ్డి

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పోరుమామిళ్ల పట్టణానికి చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ ఎం.జనార్దన్‌రెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించారు. జలుబు, దగ్గు, జ్వరం, అలర్జీ తదితర సీజనల్ వ్యాధులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, ఉపాధ్యాయులు దాదాపీర్, విద్యార్థులు పాల్గొన్నారు

సన్మానం



మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్

బ్రహ్మంగారిమఠం: బదిలీపై వెళుతున్న ఎస్ఐ విద్యాసాగర్, హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య, సిబ్బంది సుబ్బరాయుడు పసులేటి నరసింహులును శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ, పదవీ విరమణ తప్పనిసరి అని అన్నారు. ఎస్ఐగా విద్యాసాగర్ అందరి మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులరెడ్డి, పోలిరెడ్డి, గురుమూర్తి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చీతిరాల నాగార్జున మాట్లాడుతూ తిరుమల ప్రసాదాన్ని అపవిత్రం చేశారని, కల్తీ నెయ్యి వాడిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించి భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బహిరంగసభను జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్ : బద్వేలు పట్టణంలో అక్టోబరు ఒకటవ తేదీన భూ బాధితుల జిల్లాస్థాయి బహిరంగసభను నిర్వహించనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. శుక్రవారం సీపీఐ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంతో పాటు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన భూ కబ్జాలపై విచారణ జరపాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హాజరవనున్నట్లు తెలిపారు.

నేడు మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పూజలు

ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక బొల్లవరం శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల లడ్డుతో పాటు వెంకటేశ్వర స్వామి విశిష్టతను అపవిత్రం చేసినందుకుగాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

గ్రామ సచివాలయమే పాఠశాల

- శిథిలావస్థలో పాత భవనం
- ఐదేళ్లుగా ఇదే పరిస్థితి
- నిరుపయోగంగా నాడు-నేడు వస్తువులు



సచివాలయ భవనంలో కూర్చున్న విద్యార్థులు



గ్రామ సచివాలయంలో నడుస్తున్న పాఠశాల (ఇన్‌సెట్‌లో) స్కూలుకు మంజూరైన నాడు- నేడు వస్తువులు

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని సీతంపల్లె గ్రామంలో మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థానిక సచివాలయంలోనే నడుస్తోంది. ప్రభుత్వ పాఠశాల భవనం లేకపోవడమే ఇందుకు కారణం. పూర్వం నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. తర్వాత నూతన పాఠశాల భవన నిర్మాణం జరగలేదు. అదే కాంపౌండ్‌లో ఉన్న గ్రామ సచివాలయంలోనే పాఠశాల నిర్వహిస్తున్నారు. పాఠశాలలో మొత్తం 21 మంది విద్యార్థులు చదువుతుండగా.. ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది మాత్రం కాంపౌండ్ పరిధిలోనే ఉన్న అరుగు మీద కూర్చొని పనులు చేసుకుని వెళుతున్నారు. సోమవారం గ్రామంలో జరిగిన ప్రజలు కోరుకున్న పాలనకు వంద రోజుల కార్యక్రమాన్ని అధికారులు ఇందులోనే నిర్వహించారు. ఈ విషయంపై పాఠశాల ఉపాధ్యాయుడు రమణారెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం తాను బదిలీపై వచ్చానని, అంతకుముందు నుంచి పరిస్థితి ఇలాగే ఉందన్నారు. ఇదే విషయాన్ని సచివాలయ సిబ్బంది కూడా చెప్పారు. కాగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరైన మన బడి నాడు-నేడు టీవీ, ఇతర సామగ్రి.. స్థలం లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, సిబ్బంది

ప్రొద్దుటూరు : పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక టూటౌన్ బైపాస్ రోడ్డులోని థర్డ్ కాలనీ పార్కులో శుక్రవారం స్వచ్ఛతా హి సేవాలో భాగంగా సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్ బాషా, గోవిందరెడ్డి, సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీఓ కార్యాలయంలో..

స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీఓ కార్యాలయ పరిసరాలల్లో పెరిగిన పిచ్చి మొక్కలను విద్యార్థులు తొలగించి శుభ్రం చేశారు. ఎంవీఐ శ్రీనివాసులరెడ్డి, భూపాల్‌రెడ్డి, వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య బి.జయరామిరెడ్డి, డీన్ ఆచార్య కేవీ రమణయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఆర్.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, హరినాథరెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు



వ్యర్థాలు వేసిన దుకాణదారులను హెచ్చరిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దుకాణదారులు రోడ్లపై చెత్తవ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని సిద్దవటం రోడ్డులోని విద్యానగర్ సమీపంలో రోడ్లపై చెత్త వ్యర్థాలు వేసిన దుకాణదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో చెత్తసేకరణ వాహనాలను ప్రధాన రహదారుల్లో తిప్పుతున్నామని, అందులో మాత్రమే చెత్త వేయాలని కోరారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపేట హౌసింగ్ లేఅవుట్‌లో గల ఓపెన్‌స్పేస్‌లో వేసిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ తొలగించారు. ప్రభుత్వ స్థలంలో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలు తొలగింపు సమయంలో అడ్డుపడిన కృష్ణారెడ్డి అనే వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

చాపాడు: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని మండల విద్యాధికారి రవిశంకర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్ 2047లో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, వ్యక్తిత్వ, చర్చ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవిశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని అంశాలలో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. అనంతరం పోటీలు నిర్వహించి, విజేతలను ప్రకటించారు. వ్యాస రచనలో కస్తూర్బా పాఠశాలకు చెందిన దివ్య కుళాయమ్మ ప్రథమ స్థానంలో, లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.వీరమమత ద్వితీయ స్థానంలో గెలుపొందారు. వ్యక్తిత్వ పోటీలలో లక్ష్మీపేటకు చెందిన జి.సింధు మొదటి, చాపాడు హైస్కూల్‌కు చెందిన ఎస్.అస్మా సుల్తానా ద్వితీయ స్థానంలో గెలిచారు. చర్చ పోటీలలో ఆస్మా సుల్తాన ప్రథమ, ఎం.జాహ్నవి ద్వితీయ స్థానంలో గెలిచారు. మొదటి స్థానం సాధించిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు. ఎంఈఓ-2 వంశీకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు గౌస్‌మొద్దీన్, ఉపాధ్యాయులు రమణ బాబు, చంద్రశేఖర్, రాజశేఖర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మైదుకూరు : పట్టణంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం విజన్ ప్లాన్ స్వర్ణాంధ్ర-2047లో విద్యార్థుల పాత్ర అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా పలువురు విజేతలుగా నిలిచారు. విజన్ స్వర్ణాంధ్రపై వ్యాసరచన, చర్చా కార్యక్రమం, వ్యక్తిత్వ పోటీలను నిర్వహించారు. వ్యక్తిత్వ పోటీలో మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని పి.వీర ఉదయశ్రీ విజేతగా నిలిచింది. చర్చా కార్యక్రమంలో శెట్టిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎస్.శివసాయి, మైదుకూరు శివ బాలికల హైస్కూల్‌కు చెందిన జి.విజయలక్ష్మి గెలుపొందారు. వ్యాసరచన పోటీలో మండలంలోని వనిపెంట బీసీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన యు.సన విజేతగా నిలిచింది. మండల స్థాయిలో గెలుపొందిన వీరు శనివారం కడప గాంధీనగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ-1 టీఎం పద్మలత తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 నరవ హరిష్మ, సమన్వయకర్త సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వాన కురిసింది.. పంటలకు కళ వచ్చింది

ఖరీఫ్ ఆరంభం నుంచి సరైన వర్షాలు పడకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. మధ్యలో అక్కడక్కడ కొంతమేర, అరకొరగా కురిసిన వర్షాలకు రైతులు వివిధ పంటలను సాగు చేశారు. అయితే సకాలంలో వర్షాలు పడకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి పంటలు జీవం పోసుకున్నాయి. నెల రోజుల కిందట పత్తి, పసుపు, మొక్కజొన్న పంటలను సాగు చేయగా.. మూడు వారాల కిందట జొన్న, మినుము, పెసర, కొర్ర పంట సాగు చేశారు. ప్రస్తుతం పదునైన వర్షంతో పంటలు పచ్చదనం, లేతదనంతో కళకళలాడుతున్నాయి. – రాజుపాళెం



పచ్చగా ఉన్న మొక్కజొన్న పంట



కళకళలాడుతున్న పత్తిపంట



మిరప పంట

లక్ష్య సాధనకు అహర్నిశలు శ్రమించాలి



సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలతను సన్మానిస్తున్న నిర్వాహకులు

బద్వేలు అర్బన్ : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు అహర్నిశలు శ్రమించాలని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఎం.బాలలత పేర్కొన్నారు. రాచపూడినాగభూషణం విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక బయనపల్లె సమీపంలోని బొజ్జిరెడ్డి ఫంక్షన్‌హాలులో శుక్రవారం నిర్వహించిన యువజన సమ్మేళనంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ లక్ష్యాలతో కష్టపడి చదివి ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థికి స్వయంకృషి, ఏకాగ్రత, పట్టుదల చాలా అవసరమని, అలాగే పోటీతత్వం, సమయపాలన కూడా ముఖ్యమన్నారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి అనుపమానంద మహరాజ్, చిన్మయమిషన్ అధ్యక్షుడు స్వామితురియానంద సరస్వతి మాట్లాడుతూ సంపాదన ముఖ్యం కాదని, సద్గుణాలు ముఖ్యమని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అచలానంద ఆశ్రమ నిర్వాహకులు విరజానందస్వామి, ప్రముఖ ప్రొఫెసర్ ఆర్.ఓ.ఎల్.శర్మ, ఇంపాక్ట్ ట్రైనర్ కుమారి సంధ్య, రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల చైర్మన్ రాచపూడివెంకటసాయిక్రిష్ణ, డైరెక్టర్ సుజన, ప్రిన్సిపల్ సత్యానారాయణ, వెటర్నరీ ప్రొఫెసర్ రాచపూడి దిలీప్‌గుప్తా, అంకయ్య, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చాలి

మైదుకూరు : రైతులకు యూరియా కొరతను తీర్చాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ కోరారు. ఆ మేరకు మైదుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంలో సిబ్బందికి భాస్కర్ ఆధ్వర్యంలో ఏపీ రైతు సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా కేసీ కాలువకు నీరు రావడంతో మైదుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వరి పంటను ఎక్కువగా సాగు చేశారని అన్నారు. యూరియా అందుబాటులో లేక రైతులు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల్లో తగినంత యూరియా లేకపోవడంతో ఎరువుల దుకాణాలపై రైతులు ఆధారపడుతున్నారని తెలిపారు. దీనిని సాకుగా చేసుకుని వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నారని ఆరోపించారు. ఇతర ఎరువులు కొనుగోలు చేస్తే తప్ప యూరియాను ఇవ్వమంటూ రైతులను వేధిస్తున్నారన్నారు. ఇలాంటి వ్యాపారులపై వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని, వారి దుకాణాలను కూడా సీజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు కొట్టే రామ్మోహన్, పెద్ద పుల్లయ్య, జగన్, సుబ్బరాయుడు, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం



పోటీల్లో విజేతలైన విద్యార్థులు

ప్రొద్దుటూరు/కల్చరల్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి అన్నారు. మానస కళా సాంస్కృతిక సమాజం 6వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జానపద గేయాలు, జానపద నృత్యాలు, తెలుగు పద్యాలు, శాస్త్రీయ నృత్యాలు, ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించారు. బహుమతుల ప్రదానోత్సవాల కార్యక్రమానికి ప్రముఖ కవి ఏసీ దస్తగిరి, ప్రొద్దుటూరు, కడప ఉపవిద్యాశాఖాధికారులు కృష్ణప్ప, రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓ సావిత్రమ్మ, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మానస కళా సాంస్కృతిక సమాజం అధ్యక్షుడు వి.వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎం.రవిప్రకాష్, కార్యదర్శి కొత్తపల్లి శీను, ఆర్థిక కార్యదర్శి శివరావు, ఉపాధ్యాయులు లలిత కుమారి, కంభం పాములేటి, బాలగంగాధర్ తిలక్, బోగా గంగాధర్, ప్రభాకర్‌రెడ్డి, తిరులమ కొండయ్య పాల్గొన్నారు.

రేషన్ షాపు కాటాలకు సీల్ లేకుంటే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు మండల పరిధిలోని రేషన్ షాపు కాటాలకు సీల్ వేయించుకోకుంటే కేసులు నమోదు చేస్తామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జయదేవ్ హెచ్చరించారు. పట్టణంలోని పలు రేషన్ షాపులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు పరిధిలో 143 రేషన్ షాపులు ఉండగా ఇప్పటి వరకు 70 షాపుల కాటాలకు సీల్ వేసినట్లు తెలిపారు. మిగిలిన వారు ఈ నెలాఖరులోగా ముద్రలు వేయించుకోవాలని సూచించారు. ముద్ర వేయడానికి ఇప్పటికే పలుమార్లు గడువు ఇచ్చామని పేర్కొన్నారు.

దసరా ఉత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

బద్వేలు అర్బన్ : స్థానిక అమ్మవారిశాలవీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు జరిగే దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రికను శుక్రవారం అమ్మవారిశాలలో ఆవిష్కరించారు. ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి. సుబ్బారావు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు మహాలక్ష్మి ఆలయం నుంచి 108 వెండి కలశాలతో అమ్మవారిశాల వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అభిషేకం నిర్వహించి ఉత్సవాలు ప్రారంభిస్తామని తెలిపారు. 13వ తేదీ వరకు ఆయా రోజులలో అమ్మవారికి వివిధ రకాల అలంకారాలు నిర్వహించి విజయదశమి రోజున గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.ఆర్యవైశ్య వర్తక సంఘం కార్యదర్శి కొలిశెట్టినాగరాజ, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు చలమయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సబ్ రిజిస్ట్రార్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్-1గా జీఎస్‌జీ రామదాసు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే సబ్ రిజిస్ట్రార్-2గా బి.పార్వతి విధుల్లో చేరారు. కొత్త అధికారులు విధుల్లోకి చేరడంతో శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేశారు. రామదాసు మాట్లాడుతూ రికార్డుల వెరిఫికేషన్ జరుగుతోందని సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లు యథావిధిగా జరుగుతాయన్నారు.

స్టాంప్ రైటర్లతో సమావేశమా..!

కొత్తగా విధుల్లో చేరిన సబ్ రిజిస్ట్రార్లు శుక్రవారం సాయంత్రం కార్యాలయ పరిధిలోని స్టాంప్ రైటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. కొంత మందిని మాత్రమే తమ కార్యాలయంలోనికి పిలిపించి చర్చించారు. అనంతరం స్టాంప్‌రైటర్లు కేక్ కట్ చేసి సబ్ రిజిస్ట్రార్లకు అభినందనలు తెలిపారు. స్టాంప్ రైటర్లతోనే అధికారులు సమావేశం ఏర్పాటు చేయడం చర్చాంశనీయంగా మారింది.

అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా

కలసపాడు : బద్వేలులో ఈ నెల 26న నిర్వహించిన బద్వేలు నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కలసపాడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సీమాలిని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కాలువలో పూడిక తీయించిన పోలీసులు



కాలువలో మట్టిని తీయిస్తున్న పోలీసులు

ఖాజీపేట : మండలంలోని తవ్వారిపల్లెలో పంట కాలువకు అడ్డుగా వేసిన మట్టిని పోలీసులు తీయించారు. తవ్వారిపల్లె, తుడుమలదిన్నెకు వెళ్లే రహదారి వద్ద పంట కాలువ ఉంది. రహదారి నిర్మాణం కోసం కాలువను పూడ్చారు. ఈ విషయంలో రెండు గ్రామాల రైతులు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఘటనను పోలీసుల దృష్టికి స్థానికులు తెచ్చారు. ఖాజీపేట సీఐ మోహన్ చొరవ తీసుకుని జేసీబీ సహాయంతో పూడిక తీయించారు. పంట కాలువను పూడ్చడం వలన రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడతారని, ఎవరూ జోక్యం చేసుకోకూడదని సూచించారు.